సాక్షి రంగారెడ్డి

ఆదివారం । 24 । సెప్టెంబర్ । 2023



స్థానికులకు అన్యాయం

డబుల్ బెడ్రూం ఇళ్లలో స్థానికులకు అన్యాయం చేశారని సీపీఐ రాష్ట్ర సమితి సభ్యుడు రవీంద్రచారి ఆరోపించారు. 8లో▸



చాంపియన్ రంగారెడ్డి

హనుమకొండలో నిర్వహించిన రాష్ట్ర స్థాయి రెజ్లింగ్ చాంపియన్‌షిప్ పోటీల్లో రంగారెడ్డి జిల్లా చాంపియన్‌గా నిలిచింది. 8లో▸



సైబర్ మోసాలపై అవగాహన

సైబర్ మోసాలపై విద్యార్థులకు అవగాహన కల్పించారు. ఈ విషయంలో అప్రమత్తంగా ఉండాలని పోలీసులు సూచించారు. 8లో▸

ప్రేక్షకులు లేకుండానే క్రికెట్ మ్యాచ్

- బీసీసీఐ, హెచ్‌సీఏ అధికారులతో సమావేశం
- 29న ఉప్పల్ మ్యాచ్‌కు వీక్షకులకు అనుమతి లేదు
- రాచకొండ సీపీ డీఎస్ చౌహాన్ వెల్లడి



సాక్షి, సిటీబ్యూరో: ఉప్పల్ రాజీవ్ గాంధీ అంతర్జాతీయ క్రికెట్ స్టేడియంలో ఈ నెల 29న పాకిస్తాన్–న్యూజిలాండ్ జట్ల మధ్య జరగనున్న సన్నాహక మ్యాచ్‌కు ప్రేక్షకులకు అనుమతి లేదు. ఈమేరకు రాచకొండ కమిషనర్ దేవేంద్ర సింగ్ చౌహాన్ బీసీసీఐ, హెచ్‌సీఏ అధికారులతో శనివారం సమావేశం నిర్వహించారు. ఇరు జట్ల క్రీడాకారులతో పాటు బీసీసీఐ/ఐసీసీ అధికారులు తప్ప సాధారణ వీక్షకులకు ప్రవేశం లేదని చెప్పారు. క్రికెట్ ప్రపంచ కప్ పోటీలు ప్రతిష్టాత్మకమైనవి కావున క్రీడాకారులకు ఎలాంటి శాంతిభద్రత సమస్యలు లేకుండా చూడాలని పోలీసుల సిబ్బందికి సూచించారు. సమావేశంలో రిటైర్డ్ డీజీపీ (సీఆర్‌పీఎఫ్) దుర్గాప్రసాద్, డీసీపీ అభిషేక్ మహంతి, ఎస్‌ఓటీ డీసీపీ గిరిధర్, డీసీపీ రోడ్ సేఫ్టీ శ్రీబాల, ఏసీపీలు నరేష్ రెడ్డి, శ్రీనివాస్, బీసీసీఐ, హెచ్‌సీఏ అధికారులు పాల్గొన్నారు.

న్యూస్‌రీల్

108 సంస్థలో ఉద్యోగావకాశాలు

కందుకూరు: 108 సంస్థ ఈఎంఆర్ఐ–హెచ్ఈఆర్ఎస్ఎఫ్‌లో హాస్పిటల్ కోఆర్డినేటర్‌గా జిల్లాలో పని చేయడానికి ఆసక్తి గల అభ్యర్థుల నుంచి దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు సంస్థ ప్రోగ్రాం మేనేజర్ షేక్ జాన్‌షాహిద్ శనివారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. బీఎస్సీ నర్సింగ్, జీఎన్ఎంఏఎస్ఎం, ఎంపీహెచ్‌డబ్ల్యూలో ఉత్తీర్ణత కలవారు అర్హులన్నారు. ఆసక్తి ఉన్న అభ్యర్థులు విద్యార్హతలకు సంబంధించిన పత్రాల జిరాక్స్‌తో హయత్‌నగర్ ఎంపీడీఓ కార్యాలయంలోని 108 కార్యాలయంలో ఈ నెల 25న నేరుగా ఇంటర్వ్యూకు హాజరుకావచ్చన్నారు. ఇతర వివరాలకు 83099 24615 నంబర్‌లో సంప్రదించాలని సూచించారు.

28 నుంచి సమ్మెకు దిగుతాం

నోటీసు అందజేసిన మధ్యాహ్న భోజన కార్మికులు



తహసీల్దార్ గౌతంకు సమ్మె నోటీసు అందజేస్తున్న మధ్యాహ్న భోజన కార్మికులు

మొయినాబాద్: రాష్ట్ర వ్యాప్తంగా ఈ నెల 28 నుంచి నిరవధిక సమ్మెకు దిగుతున్నట్లు మధ్యాహ్న భోజన కార్మికుల సంఘం జిల్లా అధ్యక్షుడు ప్రవీణ్‌కుమార్ తెలిపారు. ఈ మేరకు శనివారం మొయినాబాద్ తహసీల్దార్ గౌతంకు సమ్మె నోటీసు అందజేశారు. అనంతరం ఆయన మాట్లాడుతూ.. సీఎం కేసీఆర్ మధ్యాహ్న భోజన కార్మికులకు ఇచ్చిన హామీలను నెరవేర్చడం లేదని అన్నారు. పెండింగ్ బిల్లులు విడుదల చేయాలని, జీవో నంబర్ 8 ప్రకారం వేతనాలు చెల్లించాలని, మధ్యాహ్న భోజన నిర్వహణను అక్షయ పాత్ర వంటి సంస్థలకు ఇవ్వొద్దని, అక్రమ తొలగింపులు, రాజకీయ వేధింపులు ఆపాలని, కార్మికులకు గుర్తింపు కార్డులు, ఈఎస్ఐ, పీఎఫ్ సౌకర్యం కల్పించాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో మధ్యాహ్న భోజన కార్మికులు పాల్గొన్నారు.

యోగాతో సంపూర్ణ ఆరోగ్యం



పోటీల్లో క్రీడాకారుల విన్యాసాలు

కడ్తాల్: విద్యార్థులు విద్యతో పాటు, యోగాభ్యాసం చేయడం హర్షణీయమని మహేశ్వర మహాపిరమిడ్ ట్రస్ట్ చైర్మన్ విజయభాస్కర్‌రెడ్డి అన్నారు. తెలంగాణ యోగాసన స్పోర్ట్స్ అసోసియేషన్ ఆధ్వర్యంలో కొనసాగుతున్న యోగాసన 4వ రాష్ట్ర స్థాయి చాంపియన్‌షిప్ పోటీలు శనివారానికి రెండో రోజుకు చేరుకున్నాయి. ఈ సందర్భంగా విజయభాస్కర్ రెడ్డి మాట్లాడుతూ.. నిరంతర యోగా సాధనతో సంపూర్ణ ఆరోగ్యాన్ని పొందొచ్చని సూచించారు. యోగాసన భారత్ నేషనల్ జాయింట్ సెక్రటరీ నందనం కృపాకర్ మాట్లాడుతూ.. ప్రస్తుతం ఇక్కడ జరుగుతున్న పోటీల్లో మెడల్స్ సాధించిన వారు నవంబర్‌లో రాజస్తాన్‌లోని మేవాడ్ యూనివర్సిటీలో జరిగే జాతీయ స్థాయి పోటీల్లో పాల్గొంటారని తెలిపారు. కార్యక్రమంలో పిరమిడ్ ట్రస్టీ సాంబశివరావు, యోగాసన స్పోర్ట్స్ అసోసియేషన్ జాయింట్ సెక్రటరీలు రాంరెడ్డి, సతీష్, వైస్ ప్రెసిడెంట్ రాంచందర్, విశాల్ ప్రాజెక్ట్ డైరెక్టర్ కిరణ్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు.

రద్దుపై భగ్గు

గ్రూప్–1 పరీక్షలు మళ్లీ రద్దు

- తడిసి మోపెడైన కోచింగ్ ఖర్చులు
- విలువైన సమయం వృథా
- నిరుద్యోగుల ఆందోళన
- తక్షణమే బోర్డును రద్దు చేయాలని డిమాండ్



ఓయూలో నిరసన వ్యక్తం చేస్తున్న విద్యార్థులు

సాక్షి, రంగారెడ్డిజిల్లా:

◆ షాద్‌నగర్‌కు చెందిన గణేశ్ ఓ ప్రైవేటు కాలేజీలో లెక్చరర్‌గా పని చేస్తున్నాడు. నెలకు రూ.35 వేల వరకు వేతనం లభించేది. ఎలాగైనా గ్రూప్–1 పోస్టు సంపాదించాలని ఏడాది క్రితం చేస్తున్న ఉద్యోగానికి సెలవు పెట్టి.. భార్యాపిల్లలను ఇంటి వద్దే వదిలేసి.. నగరానికి చేరుకున్నాడు. అశోక్‌నగర్‌లోని ఓ ప్రైవేటు హాస్టల్లో ఉంటూ పక్కనే ఉన్న కోచింగ్ సెంటర్‌లో చేరాడు. హాస్టల్ ఫీజు నెలకు రూ.ఐదు వేలకుపైగా, కోచింగ్ సెంటర్‌లో ఫీజు రూ.45 వేలు చెల్లించాడు. ఇలా ఇప్పటి వరకు రూ.లక్షకుపైగా ఖర్చు చేశాడు. అప్పటి వరకు నెలవారీగా వస్తున్న ఆదాయాన్ని కూడా వదులుకున్నాడు. రేయింబవళ్లు కష్టపడి చదివి పరీక్ష కూడా రాశాడు. తీరా ఫలితాల కోసం ఎదురు చూస్తున్న సమయంలో పరీక్షను రద్దు చేస్తున్నట్లు ప్రకటన రావడంతో తీవ్ర నిరుత్సాహానికి గురయ్యాడు.

◆ కల్వకుర్తికి చెందిన సురేష్‌కుమార్ రెండేళ్ల క్రితం డిగ్రీ పూర్తి చేశాడు. ఎలాగైనా గ్రూప్స్ సాధించాలనే లక్ష్యంతో దిల్‌సుఖ్‌నగర్‌కు చేరుకున్నారు. ఓ ప్రైవేటు హాస్టల్లో ఉంటూ పక్కనే ఉన్న కోచింగ్ సెంటర్‌లో చేరాడు. హాస్టల్ ఫీజు, కోచింగ్ ఫీజు, ఇతర ఖర్చుల కోసం ఇప్పటికే రూ.రెండు లక్షలకుపైగా ఖర్చు చేశాడు. రెండేళ్లుగా ఎంతో కష్టపడి చదివాడు. పరీక్ష రాసి..తీరా ఫలితాల కోసం ఎదురు చూస్తున్న సమయంలో పిడుగులాంటి వార్త వినాల్సి వచ్చింది. ఉద్యోగం వస్తుందనే ఆశతో ఉన్న అతనికి నిరాశే మిగిలింది.

◆ ఇలా గణేశ్, సురేష్‌కుమార్‌లు మాత్రమే కాదు హైదరాబాద్, మేడ్చల్, వికారాబాద్, రంగారెడ్డి జిల్లాల పరిధిలో గ్రూప్–1 పరీక్ష రాసిన లక్షలాది మంది నిరుద్యోగులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

ఓయూలో ఆందోళనకు దిగిన అభ్యర్థులు

ఎన్నో వ్యయ ప్రయాసలకోర్చి గ్రూప్స్ పరీక్షలు రాయడం, ఫలితాల కోసం ఎదురు చూస్తున్న సమయంలో తీరా ఆ పరీక్షలను రద్దు చేస్తున్నట్లు ప్రకటనలు వెలువడుతుండటం అభ్యర్థులను తీవ్ర నిరాశ, నిస్పృహల్లోకి నెట్టేస్తోంది. దీనిపై ఓయూలో పెద్ద ఎత్తున నిరసన వ్యక్తమవుతోంది. నిరుద్యోగుల జీవితాలతో ఆటలాడుకుంటున్న తెలంగాణ పబ్లిక్ సర్వీసు కమిషన్‌ను రద్దు చేయాలని డిమాండ్ చేస్తూ శనివారం మధ్యాహ్నం అభ్యర్థులు ఆందోళనకు దిగారు. సీఎం కేసీఆర్, టీఎస్‌పీఎస్‌సీకి వ్యతిరేకంగా పెద్దపెట్టున నినాదాలు చేశారు.

పరిహారం చెల్లించాలి



పాలకుల చేతగాని తనంతోనే రెండుసార్లు పరీక్ష రద్దయింది. ఒక్కో అభ్యర్థి రూ.లక్షలు నష్టపోవాల్సి వచ్చింది. విద్యార్థుల జీవితాలతో చెలగాటమాడుతున్న ఈ ప్రభుత్వానికి ఇకపై కొనసాగే అర్హత లేదు. ప్రభుత్వ నిర్వాకంతో అభ్యర్థులు డబ్బుతో పాటు విలువైన సమయాన్ని కోల్పోవాల్సి వచ్చింది. వారికి తగిన నష్టపరిహారం చెల్లించాలి.

– నోముల శేషు, ఓయూ జేఏసీ చైర్మన్

బోర్డును ప్రక్షాళన చేయాలి



వరుస తప్పిదాలు చేస్తున్న టీఎస్‌పీఎస్సీపై అభ్యర్థులకు నమ్మకం పోయింది. నిరాశ, నిస్పృహలకు లోనవుతున్నారు. తరచూ వివాదాలకు కారణమవుతున్న బోర్డును పూర్తిగా ప్రక్షాళన చేయాలి. నూతన బోర్డును ఏర్పాటు చేసి, సమర్థవంతంగా పరీక్షలు నిర్వహించాలి.పారదర్శకంగా నియామకాలు చేపట్టాలి.

– రాథోడ్ సంతోష్, ఎస్ఎఫ్ఐ జిల్లా కార్యదర్శి, మేడ్చల్

పరిపాటిగా మారింది



పరీక్షలు నిర్వహించడం, రద్దు చేయడం పరిపాటిగా మారింది. నిరుద్యోగుల జీవితాలతో ఆడుకుంటున్నారు. బోర్డు సభ్యులు విశ్వసనీయతను కోల్పోయారు. భవిష్యత్తులో నిర్వహించే పరీక్షలు కూడా సజావుగా సాగుతాయో లేదోననే ఆందోళన గ్రూప్ అభ్యర్థుల్లో వ్యక్తం అవుతోంది.

– కేపీఆర్, ఇంగ్లిష్ ఫ్యాకల్టీ, ట్వంటీఫస్ట్ సెంచరీ ఐఏఎస్ అకాడమీ

ఘనంగా 'పట్నం' జన్మదిన వేడుకలు



మంత్రి మహేందర్ రెడ్డి, ఎంపీ రంజిత్‌రెడ్డి, ఎమ్మెల్యేలను సత్కరిస్తున్న అభిమానులు

సాక్షి, రంగారెడ్డిజిల్లా: రాష్ట్ర సమాచార, పౌర సంబంధాల శాఖ మంత్రి పట్నం మహేందర్ రెడ్డి జన్మదిన వేడుకలు శనివారం ఘనంగా జరిగాయి. చేవెళ్ల ఎంపీ గడ్డం రంజిత్‌రెడ్డి, ఎమ్మెల్యేలు యాదయ్య, ఆనంద్, పట్నం నరేందర్ రెడ్డి, ప్రకాష్ గౌడ్, రోహిత్ రెడ్డి ఆయనకి పుష్పగుచ్ఛాలు అందజేసి శాలువాలతో సత్కరించారు. జన్మదిన శుభాకాంక్షలు తెలిపారు. మాజీ ఎమ్మెల్యేలు కేఎస్ రత్నం, ఉప్పల్ టీఆర్ఎస్ అభ్యర్థి లక్ష్మారెడ్డి బండారు, బండ్లగూడ జాగీర్ కార్పొరేషన్ మేయర్ మహేందర్ గౌడ్, కార్పొరేటర్లు సాగర్ గౌడ్, మంద రవీందర్ రెడ్డి, శ్రీలత సురేష్ గౌడ్, పాపయ్య తదితరులతో పాటు, బీఆర్ఎస్ పార్టీ జిల్లా మహిళా అధ్యక్షురాలు స్వప్న సతీష్, రంగారెడ్డి, వికారాబాద్ జెడ్పీ చైర్‌పర్సన్‌లు తీగల అనితారెడ్డి, పట్నం సునీతా రెడ్డి, జెడ్పీటీసీలు కాలె శ్రీకాంత్, అవినాష్ రెడ్డి, మాలతి, ఎల్బీనగర్ మాజీ ఇన్‌చార్జి రామ్మోహన్‌గౌడ్, జీహెచ్ఎంసీ కార్పొరేటర్లు, ఎంపీపీలు, సర్పంచులు, ఎంపీటీసీలు, సహకార సంఘాల చైర్మన్లు, మార్కెట్ కమిటీ చైర్మన్లు, పార్టీ శ్రేణులు భారీ ఎత్తున తరలివచ్చారు.

మహేశ్వరం సీటు చిగురింతకే..?

- మేయర్ వైపే మొగ్గు చూపిన కాంగ్రెస్ అధిష్టానం
- పేరు దాదాపు ఖరారు.. అధికారికంగా వెల్లడించడమే ఆలస్యం



సాక్షి, రంగారెడ్డిజిల్లా: మహేశ్వరం నియోజకవర్గం కాంగ్రెస్ అభ్యర్థిగా బడంగ్‌పేట్ మేయర్ చిగురింత పారిజాత పేరు దాదాపు ఖరారైనట్లు తెలుస్తోంది. నియోజకవర్గం నుంచి డీసీసీ అధ్యక్షుడు చల్లా నర్సింహారెడ్డి సహా సీనియర్ నాయకులు దేప భాస్కర్‌రెడ్డి, కొత్త మనోహర్‌రెడ్డి తీవ్రంగా పోటీపడ్డారు. బీఆర్ఎస్‌ను వీడి కాంగ్రెస్‌లో చేరిన కొత్త మనోహర్ రెడ్డి ఇటీవల కర్ణాటక వెళ్లారు. డిప్యూటీ సీఎంతో పైరవీ చేయించారు.అయినా అధిష్టానం మాత్రం చిగురింతవైపే మొగ్గు చూపినట్లు సమాచారం. అభ్యర్థి పేరు అధికారికంగా ఇంకా వెల్లడించాల్సి ఉంది.

సర్పంచ్‌గా మొదలైన ప్రస్థానం

చిగురింత పారిజాత మొదట్లో కాంగ్రెస్ పార్టీ నుంచి కార్పొరేటర్‌గా గెలుపొందారు. ఆ తర్వాత బీఆర్ఎస్‌లో చేరారు. మంత్రి సబితారెడ్డి ఆశీస్సులతో బడంగ్‌పేట్ మేయర్ పీఠాన్ని అధిష్ఠించారు. ఆమెకు గతంలో బాలాపూర్ సర్పంచ్‌గా పని చేసిన అనుభవం ఉంది. ఆ తర్వాత కొద్ది రోజులకే అధికార బీఆర్ఎస్‌ను వీడి మళ్లీ సొంతగూటికి చేరుకున్నారు. అప్పటి నుంచి మంత్రికి పోటీగా బరిలో నిలిచేందుకు వ్యూహాత్మకంగా వ్యవహరిస్తూ వచ్చారు. ఇటీవల తుక్కుగూడ వేదికగా నిర్వహించిన కాంగ్రెస్ విజయభేరి సభ ఏర్పాట్లు కూడా మేయర్ దంపతులే చూసుకున్నట్లు తెలిసింది. బడంగ్‌పేట్, మీర్‌పేట్, జల్‌పల్లి మున్సిపాలిటీల్లో వీరికి మంచి పట్టుంది.

అభిమాన నేతకు అంతిమ వీడ్కోలు

- హరీశ్వర్‌రెడ్డిని కడసారి చూసేందుకు వేలాదిగా తరలివచ్చిన ప్రజలు
- జనసంద్రంగా మారిన పరిగి వీధులు
- ప్రముఖుల రాకతో భారీ బందోబస్తు

పరిగి: ఆయన ప్రజల నుంచి పుట్టిన నాయకుడు.. చివరి శ్వాస వరకు ప్రజాశ్రేయస్సు కోసమే తపించిన నేత.. రాష్ట్ర స్థాయిలో పరిగి నియోజకవర్గానికి పేరు ప్రఖ్యాతులను తెచ్చిపెట్టిన మాజీ ఎమ్మెల్యే కొప్పుల హరీశ్వర్‌రెడ్డి శుక్రవారం రాత్రి గుండె పోటుతో కన్నుమూశారు. ఐదు పర్యాయాలుగా ఎమ్మెల్యేగా పని చేసిన ఆయన పేదల కోసం ఎన్నో సంక్షేమ కార్యక్రమాలు చేపట్టారు. వార్డు సభ్యుడిగా రాజకీయ ప్రస్థానాన్ని ప్రారంభించి ఉమ్మడి రాష్ట్రంలో డిప్యూటీ స్పీకర్‌గా ఎదిగారు. ఆయన కడసారి చూపు కోసం అభిమానులు వేలాదిగా తరలివచ్చారు. దీంతో పరిగి వీధులు జనసంద్రాన్ని తలపించాయి.

ప్రజాదరణ పొందిన నాయకుడు

కొప్పుల హరీశ్వర్‌రెడ్డి ప్రజాదరణ పొందిన నాయకుడు. నిత్యం ప్రజలతో మమేకమై సమస్యలను పరిష్కరిస్తూ మంచి పేరు ప్రతిష్టలు గడించారు. ఆయన ఐదు సార్లు ఎమ్మెల్యేగా గెలుపొంది నిరుపేదలకు సేవలందించారు. పరిగి నియోజకవర్గ అభివృద్ధికి నిరంతరం శ్రమించారు. ప్రజలను అన్న, తమ్ము, కాకా అంటూ వరుసలతో పిలుస్తూ కుటుంబ సభ్యుడిగా కలిసిపోయిన మహా నాయకుడు హరీశ్వర్‌రెడ్డి. ఏచిన్న కార్యమైనా.. ఆపదలో ఉన్నా వెంటనే స్పందించి వారికి తనవంతుగా సాయమందిస్తూ ఉండేవారు. ఆయన ఇక లేరనే వాస్తవాన్ని ప్రజలు జీర్ణించుకోలేకపోతున్నారు. మంత్రులు, ఎమ్మెల్యేలు, ప్రముఖుల రాకతో పోలీసులు కట్టుదిట్టమైన భద్రతా ఏర్పాట్లు చేశారు.



అధికార లాంఛనాలతో హరీశ్వర్‌రెడ్డి అంత్యక్రియలు



లడ్డూ అ'ధర'హో

❖ జేబీ ఇన్‌ఫ్రా గ్రూపు లడ్డూ @ 7 లక్షలు



గణనాథుడి వద్ద పూజలో పాల్గొన్న జేబీ గ్రూప్ సభ్యులు

తుర్కయంజాల్: గణనాథుల లడ్డూ వేలం పాటలు జోరుగా కొనసాగుతున్నాయి. మన్నెగూడలోని జేబీ ఇన్‌ఫ్రా గ్రూపు కార్యాలయంలో ఏర్పాటు చేసిన గణనాథుడి మొదటి లడ్డూను సంస్థ ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ అశోక్ రూ.7లక్షలకు దక్కించుకున్నారు. రెండో లడ్డూను మరో ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ కె.రఘుమోహన్ రెడ్డి రూ.2.35 లక్షలకు, కలశాన్ని జి.ఎం.నరేష్ రూ.1.67 లక్షలకు దక్కించుకున్నారు. అనంతరం గణేశుడి నిమజ్జనం నిర్వహించారు.

❖ రూ.5,99,999 పలికిన లడ్డూ



లడ్డూతో వెంకటేశ్వర్‌రెడ్డి దంపతులు

తుక్కుగూడ : మున్సిపల్ పరిధిలోని శ్రీనగర్ రాంకీ డిస్కవరీ సిటీ గార్డెనియా గ్రోవ్ విల్లాస్‌లో ప్రతిష్ఠించిన గణపతి విగ్రహం వద్ద ఉత్సవ కమిటీ సభ్యులు శనివారం లడ్డూ వేలం నిర్వహించారు. లడ్డూను విల్లాకు చెందిన ఐనవోలు వెంకటేశ్వర్‌రెడ్డి, హరిణిరెడ్డి దంపతులు రూ.5,99,999కు సొంతం చేసుకున్నారు. అనంతరం గణపతికి ప్రత్యేక పూజలు చేశారు.

❖ హనుమాన్ యూత్ లడ్డూ @ 2.20 లక్షలు



లడ్డూను కైవసం చేసుకున్న హనుమాన్ యూత్ సభ్యులు

కడ్తాల్: మండల కేంద్రంలోని హనుమాన్‌యూత్ వినాయక నిమజ్జన వేడుకలు శనివారం సాయంత్రం నిర్వహించారు. అంతకు ముందు పెద్ద లడ్డూకు వేలం పాట నిర్వహించగా హనుమాన్ యూత్ సభ్యులు రూ.2.20 లక్షలకు సొంతం చేసుకున్నారు. చిన్న లడ్డూను రూ.92 వేలకు కడ్తాల్ యూత్ సభ్యులు సొంతం చేసుకున్నారు. అనంతరం గణపతి నిమజ్జన ఊరేగింపు నిర్వహించారు.

❖ నిమజ్జనానికి తరలిన కలెక్టరేట్ గణపయ్య



పూజలో పాల్గొన్న కలెక్టర్ హరీశ్, అడిషనల్ కలెక్టర్ భూపాల్‌రెడ్డి తదితరులు

ఇబ్రహీంపట్నం రూరల్: ఆరు రోజులుగా అత్యంత భక్తి శ్రద్ధలతో పూజలందుకున్న కలెక్టరేట్ గణనాథుడు శనివారం గంగమ్మ ఒడికి పయనమయ్యాడు. చివరిరోజు కలెక్టర్ హరీశ్ ప్రత్యేక పూజలు నిర్వహించారు. లడ్డూను వేలం వేయగా కలెక్టరేట్ ఉద్యోగి కృష్ణ రూ.23 వేలకు సొంతం చేసుకున్నారు. కార్యక్రమంలో అడిషనల్ కలెక్టర్ భూపాల్‌రెడ్డి, డీఆర్‌ఓ సంగీత, ఏఓ ప్రమీలరాణి, పలువురు ఉద్యోగులు పాల్గొన్నారు.

❖ ఈస్ట్ లండన్‌లో వినాయక ఉత్సవాలు



ఈస్ట్‌లండన్‌లో బర్గెస్ రోడ్ యూత్ అసోసియేషన్ ఆధ్వర్యంలో నెలకొల్పిన గణనాథుడిని నిమజ్జనానికి తరలిస్తున్న పెద్దఅంబర్‌పేటకు చెందిన తెలుగు విద్యార్థులు.

– అబ్దుల్లాపూర్‌మెట్

కేసీఆర్‌కు ఎవరూ సాటిలేరు

- ప్రజా సమస్యల పరిష్కారంలో ఆయనది ప్రత్యేక ముద్ర
- మంత్రి సబితారెడ్డి



మార్కెట్ సముదాయాన్ని ప్రారంభించి కూరగాయలు విక్రయించే మహిళతో ముచ్చటిస్తున్న మంత్రి

కందుకూరు: ప్రజా సమస్యలను ముందుగానే గుర్తించి పరిష్కరించడంలో సీఎం కేసీఆర్‌కు ఎవరూ సాటిరారని విద్యాశాఖ మంత్రి సబితారెడ్డి కొనియాడారు. కందుకూరులో రూ.2.67 కోట్ల నిధులతో చేపట్టిన వివిధ అభివృద్ధి పనులతో పాటు ఓపెన్ జిమ్, కూరగాయల మార్కెట్‌ను శనివారం జెడ్పీ చైర్‌పర్సన్ అనితారెడ్డితో కలిసి ప్రారంభించారు. చౌరస్తాలో కుమ్మరి సంఘం ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన కవయిత్రి మొల్లమాంబ విగ్రహాన్ని ఆవిష్కరించారు. అనంతరం టంకరి రాంరెడ్డి ఫంక్షన్‌హాల్‌లో 300 మంది పేదలకు ఇళ్ల స్థలాల సర్టిఫికెట్లు అందించారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ.. పేదలకు 75 గజాల చొప్పున 8 ఎకరాల్లో లేఅవుట్ వేసి ఇళ్ల స్థలాలను పంపిణీ చేస్తున్నామని, ఇది తమ పిల్లలకు కేసీఆర్ ఇచ్చిన బహుమతిగా భావించాలన్నారు. పార్టీలకు అతీతంగా అర్హులైన ప్రతి ఒక్కరికీ ఇళ్ల స్థలాలు అందిస్తామన్నారు. మెట్రో రైలు కందుకూరు మీదుగా ముచ్చర్ల గేటు వరకు ఏర్పాటు చేయాలని ముఖ్య మంత్రి నిర్ణయం తీసుకున్నారన్నారు. మెడికల్ కళాశాల, న్యాయ విద్య కళాశాలల ఏర్పాటు కానున్నాయన్నారు. బీఆర్ఎస్‌కే ఓటు వేసి కేసీఆర్ రుణం తీర్చుకోవాలన్నారు. జెడ్పీచైర్‌పర్సన్ అనితారెడ్డి మాట్లాడుతూ.. దేశంలో ఏ సీఎం చేయని విధంగా కేసీఆర్ ప్రజా సంక్షేమం కోసం పని చేస్తున్నారని అన్నారు. కార్యక్రమంలో ఎంపీపీ మంద జ్యోతి, జెడ్పీటీసీ బొక్క జంగారెడ్డి, స్థానిక సర్పంచ్ ఎస్.శమంతకమణి, ఎంపీటీసీల ఫోరం అధ్యక్షుడు ఎస్.రాజశేఖర్‌రెడ్డి, వైస్ ఎంపీపీ జి.శమంత, మార్కెట్ కమిటీ చైర్మన్ ఎస్.సురేందర్‌రెడ్డి, పీఏసీఎస్ చైర్మన్ డి.చంద్రశేఖర్, డైరెక్టర్ శేఖర్‌రెడ్డి, ఉప సర్పంచ్ వెంకటయ్య, బీఆర్ఎస్ మండల అధ్యక్షుడు మన్నే జయేందర్, నియోజకవర్గ ఉపాధ్యక్షులు జి.లక్ష్మీనర్సింహారెడ్డి, అంజయ్యగౌడ్ తదితరులు పాల్గొన్నారు.

రోడ్డు ప్రమాదంలో రైతు మృతి

శంకర్‌పల్లి: కారు ఢీకొని రైతు మృతి చెందిన ఘటన శంకర్‌పల్లి పోలీస్‌స్టేషన్ పరిధిలోని ఏర్వగూడ గ్రామ శివారుల్లో శనివారం చోటు చేసుకుంది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. మండలంలోని ఏర్వగూడ గ్రామానికి చెందిన ముత్తంగి శ్రీశైలం(45) వ్యవసాయం చేసుకుంటూ జీవించేవాడు. శనివారం సాయంత్రం పని నిమిత్తం స్కూటీపై శంకర్‌పల్లి వచ్చి తిరిగి వెళ్తుండగా ఏర్వగూడ గేటు వద్ద ఎదురుగా అతి వేగంగా వచ్చిన కారు ఢీకొట్టింది. దీంతో శ్రీశైలం అక్కడికక్కడే మృతి చెందాడు.

హెచ్చరిక

ఇందుమూలముగా సమస్త ప్రజానీకమునకు తెలియజేయునది ఏమనగా క్రింద వివరించిన రంగారెడ్డి జిల్లా (పాత మహబూబ్‌నగర్ జిల్లా), బడ్డాయిపల్లి శేరిగూడ గ్రామం, మహేశ్వరం మండలం షెడ్యూలు-ఎ ప్రాపర్టీ మరియు రంగారెడ్డి జిల్లా (పాత మహబూబ్‌నగర్ జిల్లా), బడ్డాయిపల్లి శేరిగూడ గ్రామం, కొత్తూరు మండలంలోని షెడ్యూలు-2 ప్రాపర్టీలకు సంబంధించి నా క్లయింటు అయిన సింగిరెడ్డి జంగారెడ్డి తండ్రి పేరు అంజిరెడ్డి, వయస్సు 45 సం॥లు, వృత్తి: వ్యవసాయం, అల్మాస్‌గూడ గ్రామం, బాలాపూర్ మండలం, రంగారెడ్డి జిల్లా వాస్తవ్యులు గౌరవ 7వ జిల్లా జడ్జి (ఎస్.సి మరియు ఎస్.టి కోర్టు) కోర్టులో రంగారెడ్డి జిల్లా, ఎల్‌బినగర్ గారి కోర్టులో తనకురావల్సిన భాగం కొరకు సింగిరెడ్డి నారాయణరెడ్డి మరియు ఇతరులపై పార్టీషన్ దావా వేసియున్నాడు (దావా నం.ఒ.ఎస్ నెం.540/2023) కావున పైన తెలిపిన పార్టీషన్ దావా పెండింగ్‌లో ఉండగా ఇట్టి ప్రాపర్టీకి సంబంధించి ఎలాంటి లావాదేవీలు జరుపవద్దని, ఒకవేళ జరిపినచో అట్టి లావాదేవీలు చట్టప్రకారం చెల్లనేరవు మరియు అట్టి లావాదేవీలకు సదరు వ్యక్తులే బాధ్యులగుదురని హెచ్చరించడమైనది.

షెడ్యూలు ప్రాపర్టీ - 1

రంగారెడ్డి జిల్లా (పాత మహబూబ్‌నగర్ జిల్లా), బడ్డాయిపల్లి శేరిగూడ గ్రామం, మహేశ్వరం మండలం, తెలంగాణ పరిధిలోని సర్వే నెం.234/3, 234/7 లో విస్తీర్ణం 21-18 గుంటలు దీనికి సంబంధించిన హద్దులు. ఉత్తరం: ప్రభుత్వ భూమి మరియు నైబర్స్ భూమి, దక్షిణం: ఎస్. మాధవరెడ్డి భూమి, తూర్పు: ఎస్. మల్లారెడ్డి భూమి, పడమర: గోంగళ్ల అంజయ్య భూమి.

షెడ్యూలు ప్రాపర్టీ - 2

రంగారెడ్డి జిల్లా (పాత మహబూబ్‌నగర్ జిల్లా), బడ్డాయిపల్లి శేరిగూడ గ్రామం, కొత్తూరు మండలం, తెలంగాణ పరిధిలోని సర్వే నెం.67,69,70,74,75,77,78,79 లో విస్తీర్ణం 4-30 గుంటలు దీనికి సంబంధించిన హద్దులు. ఉత్తరం: శివారు, జగన్‌మోహన్‌రెడ్డి మరియు ఇతరులు, దక్షిణం: అంజనేయులు మరియు ఇతరుల భూమి, తూర్పు: ఎస్. మల్లయ్య మరియు ఇతరుల భూమి, పడమర: వడ్ల రత్నయ్య మరియు ఇతరుల భూమి.

ఇట్లు
సం/- జి. రమాశంకర్, అడ్వకేట్
ఇంటి నెం.12-1/5, టిఆర్ఆర్ కాలనీ,
బడంగ్‌పేట్ గ్రామం, సరూర్‌నగర్ మండలం,
రంగారెడ్డి జిల్లా-058. ఫోన్: 7032251997

'డబుల్' ఇళ్లలో స్థానికులకు అన్యాయం

సీపీఐ రాష్ట్ర సమితి సభ్యుడు రవీంద్రచారి

ఇబ్రహీంపట్నం: డబుల్ బెడ్రూం ఇళ్ల కేటాయింపులో స్థానికులకు అన్యాయం చేశారని సీపీఐ రాష్ట్ర సమితి సభ్యుడు రవీంద్రచారి ఆరోపించారు. డబుల్ బెడ్రూం ఇళ్లు స్థానికులకే కేటాయించాలని డిమాండ్ చేస్తూ శనివారం ఇబ్రహీంపట్నంలోని ఆర్డీఓ కార్యాలయాన్ని ముట్టడించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. స్థానికేతరులకు ఇళ్లను కేటాయించి స్థానికులకు అన్యాయం చేయడం తగదన్నారు. స్థానికులకు 60 శాతం ఇళ్లు కేటాయించాలన్నారు. ఎన్నికలకు ముందు ఇచ్చిన హామీలను పాలకులు విస్మరిస్తున్నారని ఆరోపించారు. అర్హులైన వారికి ఇళ్ల స్థలాలు ఇవ్వాలని కోరారు. ఇళ్ల కేటాయింపులో న్యాయం చేయకుంటే ఆందోళన ఉధృతం చేస్తామని హెచ్చరించారు. అనంతరం ఆర్డీఓ అనంతరెడ్డికి వినతిపత్రం సమర్పించారు. కార్యక్రమంలో పార్టీ రాష్ట్ర నాయకులు కావలి నర్సింహ, ముత్యాల యాదిరెడ్డి, కృష్ణ, నీలమ్మ, లక్ష్మయ్య, సంజీవ, లక్ష్మణ్, హరి సింగ్ పాల్గొన్నారు.



ఆర్డీఓ కార్యాలయం వద్ద సీపీఐ నేతలు, స్థానికులు

ఓవరాల్ చాంపియన్ రంగారెడ్డి

- ముగిసిన రాష్ట్రస్థాయి రెజ్లింగ్ పోటీలు
- ఫ్రీ స్టైల్ విభాగంలో విజేతలుగా నిలిచిన బాలికలు
- బాలుర విభాగంలో విన్నర్ హైదరాబాద్



ఓవరాల్ చాంపియన్‌షిప్ ట్రోఫీని అందుకుంటున్న రంగారెడ్డి క్రీడాకారులు

వరంగల్ స్పోర్ట్స్: హనుమకొండ జిల్లా పాఠశాల క్రీడల సమాఖ్య (ఎస్‌జీఎఫ్) ఆధ్వర్యంలో హనుమకొండలోని జిల్లా డీఎస్‌ఏ ఇండోర్ స్టేడియంలో నిర్వహిస్తున్న అండర్- 17 బాలబాలికల రాష్ట్రస్థాయి రెజ్లింగ్ చాంపియన్‌షిప్ పోటీలు శనివారం రాత్రి ముగిశాయి. రెండు రోజుల పాటు జరిగిన పోటీల్లో ఉమ్మడి పది జిల్లాల నుంచి 400 మంది క్రీడాకారులు తలపడ్డారు. ముగింపు వేడుకలకు హనుమకొండ డీవైఎస్‌ఓ జి.అశోక్ ముఖ్యఅతిథిగా హాజరై విజేతలకు ట్రోఫీ, పతకాలను అందజేశారు. ఎస్‌జీఎఫ్ హనుమకొండ జిల్లా కార్యదర్శి దస్రూనాయక్ మాట్లాడుతూ.. ఇక్కడ ప్రతిభ కనబరిచిన క్రీడాకారులు అక్టోబర్ 2 నుంచి 8వ తేదీ వరకు మధ్యప్రదేశ్‌లోని విదిషలో జరిగే జాతీయ స్థాయి పోటీల్లో పాల్గొంటారని తెలిపారు. పోటీల నిర్వహణకు సహకరించిన ప్రభుత్వ చీఫ్‌విప్ దాస్యం వినయ్‌భాస్కర్, జిల్లా విద్యాశాఖ అధికారికి కృతజ్ఞతలు తెలిపారు. కార్యక్రమంలో పీఈటీల సంఘం రాష్ట్ర అధ్యక్ష, కార్యదర్శులు ప్రభాకర్‌రెడ్డి, రాజబోయిన భిక్షపతి, పీడీ, పీఈటీలు సదానందం, రాజు, పార్థసారథి, డి.కుమార్ తదితరులు పాల్గొన్నారు.

135 పాయింట్లతో..

బాలికల ఫ్రీస్టైల్ విభాగంలో 135 పాయింట్లతో రంగారెడ్డి జిల్లా క్రీడాకారులు మొదటి స్థానంలో నిలిచి ఓవరాల్ చాంపియన్‌షిప్ ట్రోఫీని కైవసం చేసుకున్నారు. 125పాయింట్లతో హైదరాబాద్ క్రీడాకారులు రెండో స్థానంలో నిలువగా, 120 పాయింట్లతో మహబూబ్‌నగర్ జిల్లా క్రీడాకారులు మూడో స్థానంలో నిలిచారు. బాలుర విభాగంలో 220 పాయింట్లతో హైదరాబాద్ ప్రథమ స్థానాన్ని దక్కించుకుని ఓవరాల్ చాంపియన్‌షిప్ ట్రోఫీని అందుకోగా.. 95 పాయింట్లతో నిజామాబాద్ ద్వితీయ స్థానంలో నిలువగా.. 90 పాయింట్లతో ఆదిలాబాద్ జిల్లా క్రీడాకారులు తృతీయ స్థానంలో నిలిచి పతకాలను అందుకున్నారు.

గ్రీకోరోమన్ కేటగిరీలో..

బాలురకు ప్రత్యేకంగా నిర్వహించే గ్రీకోరోమన్ విభాగంలో 215 పాయింట్లతో హైదరాబాద్ ప్రథమ స్థానంలో నిలిచింది. 120 పాయింట్లతో రంగారెడ్డి జిల్లా ద్వితీయ స్థానంలో.. 95 పాయింట్లతో ఆతిథ్య వరంగల్ తృతీయ స్థానంలో నిలిచింది.

సైబర్ మోసాలపై అవగాహన

ఇబ్రహీంపట్నం: రోజురోజుకు పెరుగుతున్న ఇంటర్నెట్ సేవలతో పాటు సైబర్ మోసాలు కూడా బాగా పెరుగుతున్నట్లు ఎస్‌ఐ మైబెల్లి అన్నారు. ఇబ్రహీంపట్నంలోని కార్తికేయ, వాసవీ కళాశాలల్లో శనివారం సైబర్ క్రైం అంశాలపై విద్యార్థులకు అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ..సైబర్ నేరాల పట్ల అప్రమత్తంగా ఉండాలన్నారు. ప్రతి మెసేజ్‌కు, మెయిల్‌కు స్పందించొద్దన్నారు. మనకు తెలిసిన వ్యక్తుల కాదా అని నిర్ధారించుకున్న తర్వాతే స్పందించాలన్నారు. సైబర్ నేరగాళ్లు ఆన్‌లైన్ ద్వారా మహిళలను వేధింపులకు గురి చేస్తున్నట్లు తెలిపారు. సైబర్ మోసాలను నిరోధించేందుకు యువత పోలీసులకు సహకరించాలని కోరారు. ఈ సందర్భంగా వాల్‌పోస్టర్లను ఆవిష్కరించారు. అత్యవసర సమయల్లో 8712662662 నంబర్‌కు ఫోన్ చేయాలని తెలిపారు. కార్యక్రమంలో పోలీసు సిబ్బంది బాబురావు, మీనాకుమారిలు పాల్గొన్నారు.

పోలీసుల విధులపై అవగాహన

యాచారం: నక్కర్తమేడిపల్లి గ్రీన్ ఫార్మాసిటీ పోలీస్‌స్టేషన్‌లో శనివారం ఉన్నత పాఠశాల విద్యార్థులకు పోలీస్ విధులు, బాధ్యతలపై అవగాహన కల్పించారు. సీఐ రామాంజనేయులు, ఎస్‌ఐ ప్రసాద్‌లు, విద్యార్థులకు ఫిర్యాదుల స్వీకరణ, కేసుల నమోదు, పోలీసుల విధులు, సమయపాలన, సైబర్‌క్రైమ్స్, 100కు కాల్ తదితర విషయాలపై అవగాహన కల్పించారు. పోలీస్ స్టేషన్‌లో ఉండే సీఐ, ఎస్‌ఐ, పోలీస్ సిబ్బంది పని తీరుపై అవగాహన కల్పించారు.



యాచారం: అవగాహన కల్పిస్తున్న సీఐ రామాంజనేయులు, ఎస్‌ఐ ప్రసాద్

ఉన్నతస్థాయికి ఎదగాలి

చేవెళ్ల: విద్యార్థులు బాగా చదువుకొని ఉన్నతస్థాయికి ఎదిగి పాఠశాలకు, తల్లిదండ్రులకు మంచిపేరు తీసుకురావాలని చేవెళ్ల సీనియర్ సివిల్ కోర్టు జడ్జి శ్రీదేవి పేర్కొన్నారు. శనివారం మండల కేంద్రంలోని కస్తూర్బాగాంధీ బాలికల పాఠశాలను ఆమె సందర్శించి న్యాయవిజ్ఞాన సదస్సు కార్యక్రమం నిర్వహించారు. అనంతరం కేజీబీవీలోని పాఠశాల వసతులను పరిశీలించి సమస్యలను అడిగి తెలుసుకున్నారు. విద్యార్థులు చదువుతో పాటు సామాజిక, న్యాయపరమైన అంశాలపై అవగాహన కలిగి ఉండాలని సూచించారు. బాల్యవివాహాలు, సైబర్ నేరాలు, రాగ్గింగ్, ఈవ్‌టీజింగ్, మోసపూరితమైన వ్యక్తుల గురించి విద్యార్థులకు తెలియజేశారు. ఇలాంటి వారి పట్ల అప్రమత్తంగా ఉండాలని చెప్పారు. కార్యక్రమంలో పాఠశాల ఇన్‌చార్జి శ్వేతా, బార్ అసోసియేషన్ న్యాయవాదులు ఎస్. చంద్రశేఖర్, కె. కుమార్, డి. శ్రీనివాస్, కె.మహేందర్, విద్యార్థులు, ఉపాధ్యాయులు తదితరులు ఉన్నారు.

విద్యుత్ షాక్‌కు ఇద్దరు బలి

ఇబ్రహీంపట్నం: వేర్వేరు ప్రాంతాల్లో విద్యుత్ షాక్‌కు గురై ఇద్దరు బలైన ఘటన ఇబ్రహీంపట్నం పోలీస్‌స్టేషన్ పరిధిలో శనివారం చోటు చేసుకుంది. సీఐ రామకృష్ణ వివరాల ప్రకారం.. దండుమైలారం శివారులోని ట్రాన్స్‌ఫార్మర్ వద్ద ఎర్త్‌వైరు తగిలి షాక్ గురై రాజశేఖర్(29) అక్కడికక్కడే మృతి చెందారు.

ఉప్పరిగూడలో...

ఉప్పరిగూడలో ఎ. చంద్రారెడ్డి వ్యవసాయ క్షేత్రంలో టిప్పర్‌తో మట్టిని అన్‌లోడ్ చేసేందుకు హైడ్రాలిక్‌ను ఎత్తగా ట్రక్‌పై ఉన్న విద్యుత్ తీగలకు తగిలింది. ఈ విషయాన్ని గమనించక క్లీనర్ ఎ.అబ్బయ్య(35) వెనుక ఉన్న ట్రక్‌రాడ్ తీయడంతో విద్యుత్ షాక్‌కు గురై స్పృహ తప్పి కిందపడిపోయాడు. వెంటనే నగరంలోని ఉస్మానియా ఆస్పత్రికి తరలించారు. చికిత్సపొందుతూ మృతి చెందినట్లు తెలిపారు. ఈ రెండు ఘటనలపై కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు సీఐ రామకృష్ణ తెలిపారు.